సాక్షి నిర్మల్

ఆదివారం । 8 । జనవరి । 2023



ఖందేవ్ సన్నిధిలో మహాపూజ

పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని తొడసం వంశీయులు శుక్రవారం రాత్రి ఖందేవునికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భేటీ అయ్యారు. 10లో▸



విజ్ఞానమేళా.. చూసొద్దాం రండి

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ మేళా నిర్వహణకు నిర్మల్ సిద్ధమైంది. జిల్లా కేంద్రం సమీపంలోని కొండాపూర్ సెయింట్‌థామస్ పాఠశాలలో అధికారులు ఏర్పాట్లు చేశారు. 12లో▸

గరిష్టం/కనిష్టం
28.4 / 11.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గుతాయి. రాత్రి మంచు అధికంగా కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

కాకతీయ.. ఇదేం పరీక్ష!

- అందుబాటులో అవకాశం ఉన్నా.. దూరంగా కేంద్రాలు
- సెంటర్ల మార్పు వెనుక రాజకీయాలు
- సిండికేట్ అవుతున్న కాలేజీలు
- మారుమూల విద్యార్థులకు తప్పని పాట్లు





పరీక్ష కేంద్రంలో ఉండాల్సిన ఈ విద్యార్థులు ఆస్పత్రిలో ఉన్నారు. శ్రద్ధగా పరీక్ష రాయాల్సిన వీళ్లు గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఇందుకు కారణమెవరు..? జిల్లాకు దూరంగా ఉన్న కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులకూ 'దూరభార' పరీక్షలు పెడుతోంది. అందుబాటులో అవకాశాలు ఉన్నా.. పరీక్ష కేంద్రాలను దూరంగా విసిరేస్తోంది. ఈ కారణంతోనే ఈ విద్యార్థులు బాధితులుగా మారాల్సి వచ్చింది. వీరంతా దస్తురాబాద్ మండలకేంద్రంతోపాటు భూత్కూర్, రాంపూర్, బుట్టాపూర్ తదితర గ్రామాలకు చెందినవారు. ఖానాపూర్‌లో డిగ్రీ పరీక్షలు రాసేందుకు శనివారం ఉదయం బయలుదేరారు. బస్సులు లేకపోవడంతో ఆటోలో వస్తుండగా ధర్మాజీపేట వద్ద వీరి ఆటోబోల్తా పడింది. పరీక్షలు రాయాల్సిన వీరు ఇలా ఆస్పత్రిపాలయ్యారు.

నిర్మల్: జిల్లాలో కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల తీరుపై అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా పరీక్ష కేంద్రాల కేటాయింపుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలను నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ కేంద్రాలను దూరంగా ఏర్పాటు చేయడంపై అనుమానం వ్యక్తమవుతోంది. ఒకే మండలంలో లేదంటే పక్కనే ఉన్న మండలంలో రెండు మూడు కాలేజీలు ఉన్నా.. వాటిని కాదని దూరంగా ఎందుకు సెంటర్ ఏర్పాటు చేశారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లాకు చెందిన కొంతమంది సీనియర్ అధ్యాపకులు, పలు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి ఇలాంటి నిర్ణయాలకు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. కనీ సంస్టాఫ్ లేకున్నా, సరిపడా గదులు లేకున్నా ఖానాపూర్‌లో కొన్ని కాలేజీలకు పరీక్ష సెంటర్లు కేటాయించారు. జిల్లాకు చెందిన ఒకరిద్దరు ప్రభుత్వ అధ్యాపకులు ప్రైవేటు కళాశాలలతో దోస్తీ చేస్తూ వర్సిటీ నుంచి తీసుకునే నిర్ణయాల్లో మార్పు చేసేలా కీలకంగా వ్యవహరిస్తున్నట్లు కొంతకాలంగా విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారికి తగ్గట్లుగా కేయూ నుంచి ఆదేశాలు తెప్పిస్తున్నారని తెలుస్తోంది.

రాసేవారెందరు..

క్షేత్రస్థాయిలో ఏమాత్రం పరిశీలించకుండా తీసుకుంటున్న నిర్ణయాలతో చాలామంది విద్యార్థులు తమ విద్యాసంవత్సరాన్ని కోల్పోవాల్సి వస్తోంది. కడెం మండలం కన్నాపూర్‌లోని ఎల్ఎంఆర్ కళాశాలకు కడెం, దస్తురాబాద్ మండలాల్లో మారుమూల తండాలు, గూడేలు, గ్రామాల నుంచి విద్యార్థులు ఉన్నారు. వీరికి ఆరేడేళ్లుగా కడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఉండేది. ఈసారి ఖానాపూర్‌లో సెంటర్ వేశారు. దీంతో మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులకు దాదాపు 40–50 కి.మీ. దూరభారమైంది. కనీసం బస్సు సౌకర్యాలు లేని ఆ విద్యార్థులు ఖానాపూర్ వరకు ఎలా వస్తారన్న ఆలోచన కూడా అధికారులు చేయకపోవడం గమనార్హం. ఇదేక్రమంలో శనివారం ఉదయం హడావుడిగా పరీక్షకు వస్తున్న విద్యార్థులు ఆటో బోల్తాపడి గాయాలపాలయ్యారు. తొమ్మిదిమంది పరీక్ష రాయలేకపోయారు. ఖానాపూర్‌తోపాటు నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. పరీక్షకేంద్రం దూరం కావడంతో మారుమూల గ్రామాల విద్యార్థులు చాలామంది రాయడం లేదని అధ్యాపకులే చెబుతున్నారు.

దూరంగా.. భారంగా..

పరీక్ష కేంద్రాల మార్పులో కాకతీయ యూనివర్సిటీ అధికారులు తీసుకున్న నిర్ణయాలు విస్తుగొల్పుతున్నాయి. క్షేత్రస్థాయిలో విషయాలు, విద్యార్థుల ఇబ్బందులు తెలుసుకోకుండా కేవలం ఇక్కడి ఇన్‌చార్జీలు చెప్పినట్లుగా చేసేస్తున్నారు. ఇందుకు చిన్న ఉదాహరణ.. లక్ష్మణచాంద, మామడ మండలాల్లోని కాలేజీలకు ఖానాపూర్‌లో సెంటర్ వేయడమే. లక్ష్మణచాంద సహకార కళాశాల విద్యార్థులకు గతంలో నిర్మల్ లేదంటే మామడలో పరీక్ష కేంద్రం ఉండేది. ఈసారి ఖానాపూర్‌లో వేశారు. అసలు లక్ష్మణచాంద నుంచి ఖానాపూర్ వెళ్లాలంటేనే ఇబ్బంది. తమ గ్రామాల నుంచి నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారి వరకు వచ్చి, అక్కడి నుంచి మరో బస్సులో ఖానాపూర్ వెళ్లాలి. ఖానాపూర్ కంటే సమీపంలో ఉండటమే కాకుండా నిర్మల్‌కు ఆయా గ్రామాల నుంచి బస్సు సౌకర్యం ఉంది. అయినా ఇక్కడి విద్యార్థులను ఖానాపూర్ సెంటర్‌కు కేటాయించారు.

పాఠశాలలకు పీఎంశ్రీ

- కేంద్రం నిధులతో మరిన్ని వసతులు
- కొనసాగుతున్న ఎంపిక ప్రక్రియ



వివరాలు సేకరిస్తున్న జిల్లా పరిశీలకుల బృందం

మామడ: ప్రభుత్వ పాఠశాలలు అరకొర వసతులతోనే కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మేలో రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాల కల్పనకు మన ఊరు – మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం మొదటి విడతగా 238 పాఠశాలలను ఎంపిక చేసింది. పనులు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించి, సౌకర్యాలు కల్పించేందుకు ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఇందుకోసం ప్రతీ మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. యుడైస్‌లో నమోదైన పాఠశాలల సమాచారం ప్రకారం ఉన్నతాధికారులు పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. జిల్లాల వారీగా పాఠశాలను ఎంపిక చేసేందుకు మొదట జిల్లాస్థాయిలో అధికారులు పాఠశాలలను పరిశీలిస్తున్నారు. పాఠశాలలకు సొంత భవనం, అగ్నిప్రమాదం నుంచి రక్షణ, విద్యార్థుల నమోదు, మరుగుదొడ్లు, తాగునీరు, శుభ్రత, ఉపాధ్యాయులు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన అంశాలను జిల్లా అధికారుల బృందం పరిశీలించి రాష్ట్రస్థాయి అధికారులకు ఆన్‌లైన్‌లో అందిస్తారు. రాష్ట్రపరిశీలక బృందం ఎంపిక చేసిన పాఠశాలలను పరిశీలించి కేంద్రస్థాయి అధికారులకు పంపిస్తారు. జాతీయస్థాయి పరిశీలకులు పాఠశాలలను ఎంపిక చేయనున్నారు.

ఎంపికైన పాఠశాలలో రూ.2 కోట్లతో వసతులు...

ప్రస్తుతం జిల్లా పరిశీలకులు పాఠశాలల సందర్శన కొనసాగుతోంది. ఈనెల 10 వరకు పాఠశాలల వివరాలను నమోదు చేయనున్నారు. నమోదు చేసిన పాఠశాలలు ప్రతీ మండలం నుంచి ఒక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేయనున్నారు. ఈ పథకానికి ఎంపికైన పాఠశాలలకు 2022–23 నుంచి 2025–26 విద్యాసంవత్సరం ఏటా రూ.40 లక్షల చొప్పున రూ.2 కోట్లు వెచ్చించి అన్ని వసతులు కల్పిస్తారు. ఇందుకోసం జిల్లాలో 95 పాఠశాలలను యూడైస్ ప్రకారం గుర్తించిన అధికారులు 70 పాఠశాలలు నిబంధనల ప్రకారం ఉన్నాయని గుర్తించారు. ఈ పాఠశాలల వివరాలను రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయిలో ఎంపికైతే నిధులు సమకూరుతాయి. పీఎంశ్రీ పథకం ద్వారా మంజూరైన నిధులతో ఎంపిక చేసిన పాఠశాలల రూపురేఖలు మారిపోనున్నాయి. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, విద్యార్థులకు విద్యాపరమైన వసతులు, అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులకు శిక్షణ వంటివి సమకూరుస్తారు.

ఆన్‌లైన్‌లో పాఠశాలల నమోదు..



పీఎంశ్రీ పథకానికి పాఠశాలల ఎంపికలో భాగంగా జిల్లా పరిశీలకులు పరిశీలించిన పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఈనెల 10 వరకు ఆన్‌లైన్ చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తాం. జాతీయస్థాయి పరిశీలకులు సందర్శించి ఎంపిక చేస్తారు.

– రవిగౌడ్, సెక్టోరియల్ అధికారి

వసతులు సమకూరుతాయి



పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలలకు పూర్తిస్థాయిలో వసతులు సమకూరుతాయి. విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకం ద్వారా విడతల వారీగా అయిదు సంవత్సరాల్లో రూ.2 కోట్ల నిధులతో ఎంపికైన పాఠశాలలలో అభివృద్ధి పనులు నిర్వహిస్తారు.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: లంబాడా హక్కుల పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తండాలలో జీవిస్తున్న గిరిజనులకు పోలీసులు కల్పిస్తున్న రక్షణ చర్యలు కొండంత బలమని పేర్కొన్నారు.

సాంఘికశాస్త్రంలో విద్యార్థుల ప్రతిభ



చైతన్యకు ప్రశంసాపత్రం ఇస్తున్న ఫోరం సభ్యులు

లోకేశ్వరం: నిర్మల్ పట్టణంలో జిల్లా ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదివే విద్యార్థులకు తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్రంపై ట్యాలెంట్ టెస్టు శనివారం నిర్వహించారు. ఇందులో లోకేశ్వరం ఉన్నత పాఠశాలకు చెందిన చైతన్యకు మొదటి బహుమతి, అక్షయ తృతీయ బహుమతి, కేజీబీవీ విద్యార్థిని లోకిత ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం సభ్యులు అభినందించారు. ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు నకిరెడ్డి నారాయణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, ఆర్థిక కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, వినోద్‌కుమార్, ఫోరం సభ్యులు అనిత మహావడి, విజయలక్ష్మి, పోతన, శ్రీనివాస్, శేఖర్, మల్లికార్జున్, గంగాధర్, భూషణ్, మధుకర్‌రావు పాల్గొన్నారు.

బోరిగాం పాఠశాల సందర్శన



వివరాలను తెలుసుకుంటున్న ఎంఈవో

తానూరు: మండలంలోని బోరిగాం పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో వారం రోజులుగా పురుగులు వస్తున్నాయని విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. దీంతో ఎంఈవో సుభాష్ శనివారం పాఠశాలను సందర్శించారు. వివరాలను తెలుసుకున్నారు. బియ్యం పాతస్టాక్ కావడంతో ఎంత శుభ్రం చేసినా అన్నంలో పురుగులు వస్తున్నాయని మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు తెలిపారు. బియ్యంలో పురుగులు ఉంటే తిరిగి పంపించాలని ఎంఈవో ఆదేశించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో తినలేక పోతున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని హెచ్ఎం విశ్వనాథ్ అప్పాను ఎంఈవో ఆదేశించారు.

11న కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌రూరల్: కేజీబీవీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ మహాసభలు ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు హరిత తెలిపారు. జిల్లా కేంద్రంలో సభల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కేజీబీవీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వీరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఒడిశాలో 57 వేల మందిని అక్కడి ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసిందని తెలిపారు. వంట కార్మికులు, స్వీపర్లు, స్కావెంజర్లకు రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, విజయలక్ష్మి, సత్తవ్వ, లక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

తొలుగుతున్న దుమ్ము

- 'సాక్షి' కథనంతో కదలిక
- కలెక్టర్ ఆదేశాలతో రోడ్లు క్లీన్
- ఇరువైపులా మట్టి, దుబ్బ తొలగింపు


దుమ్ము.. దుమ్ము

డిసెంబర్ 15న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

త్వరలోనే క్లీన్ చేస్తాం..

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలో రోడ్లపై దుమ్మును శుభ్రం చేస్తున్నాం. మట్టికుప్పలను తొలగిస్తున్నాం. త్వరలోనే అన్నిరోడ్లనూ క్లీన్‌గా ఉంచుతాం.

– దేవదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నిర్మల్

నిర్మల్: జిల్లాకేంద్రంతోపాటు జిల్లా వ్యాప్తంగా రహదారులన్నీ మట్టితో నిండిపోయాయి. వాహనదారులు, బాటసారుల కళ్లల్లో దుమ్ము నిండుతోంది. ప్రజల ఇబ్బందులపై 'సాక్షి'లో 'దుమ్ము.. దుమ్ము' శీర్షికన డిసెంబర్ 15న కథనం ఇచ్చాం. దీనికి స్పందించిన కలెక్టర్ ముషరఫ్ అలీ దుమ్మును తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు ఇటీవల నిర్మల్ మున్సిపాలిటీలో ఈ పనులను వేగవంతంగా చేశారు.

ఇరువైపులా మట్టి..

ప్రధానంగా జిల్లాకేంద్రంలోని రహదారులకు ఇరువైపులా మట్టి పేరుకుపోయింది. చాలావరకు దుమ్ము రోడ్డును కమ్మేసింది. కళ్లకు ఇబ్బందితోపాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని 'సాక్షి' కథనంలో వివరించాం. జిల్లాలో దుమ్ముతో కూడిన రోడ్లపై ప్రజాసంగ్రామయాత్రలో బండి సంజయ్ వేసిన సెటైర్‌నూ గుర్తు చేశాం. దీంతో కలెక్టర్ ముషరఫ్‌అలీ స్పందించి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు వారం రోజులుగా మున్సిపల్ సిబ్బంది రోడ్లను శుభ్రం చేసే పనులు చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి దిబ్బలను తొలగిస్తున్నారు.



నిర్మల్‌లో మట్టి తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



భైంసారోడ్డులో మట్టి తొలగిస్తున్న స్కిడ్‌స్టీర్ లోడర్

భూగర్భ జలాలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాస్

కడెం: భూగర్భ జలాలను కాపాడుకోవాలని భూగర్భ జలశాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో భూగర్భ జలశాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూగర్భ జలాల ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి రాములు పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. మద్ది చెట్లపై పట్టు పురుగుల పెంపకం లాభదాయకమైనదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుర్ర లక్ష్మి, ఉప సర్పంచ్ శ్రావణ్, రిలయన్స్ ఫౌండేషన్ డీపీవో రాజేందర్‌రెడ్డి, సెక్రెటరీ చైతన్య, ఏఫ్ఏలు నాగవత్ రవీందర్, సత్తెన్న, రుశికేశ్, పున్నం తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు పకడ్బందీ ఏర్పాట్లు



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముషరఫ్ అలీ తెలిపారు. ఈనెల 9, 10, 11 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు హేమంత్‌బోర్కడే, రాంబాబుతో కలిసి పరిశీలించారు. సెయింట్ థామస్, గౌతమ్ మోడల్ స్కూల్, విజయ హైస్కూల్, ద్యాంగాపూర్ ఎస్ఆర్ స్కూల్‌ను సందర్శించారు. అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను మొదటిసారిగా జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9న విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. 33 జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులకు, గైడ్ టీచర్లకు అసౌకర్యం కలుగకుండా చూడాలని తెలిపారు. వసతి, భోజన సదుపాయంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. 25 భోజన కౌంటర్ల ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, వీఐపీలకు వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. వారివెంట డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సుభాష్‌చందర్, ప్రభాకర్, సెక్టోరియల్ అధికారి పద్మ, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఖానాపూర్: జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి 50వ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు రావాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు శనివారం ఆహ్వానం అందజేశారు. ఎంఈవో మధుసూదన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలిసి ఆహ్వానించారు.

వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించాలి

మామడ: జిల్లా కేంద్రంలోని సెయింట్‌థామస్ పాఠశాలలో ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విద్యార్థులు తిలకించాలని టీటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని కోర్టికల్, పరిమండల్ పాఠశాలలను శనివారం సందర్శించారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించే అవకాశం జిల్లాకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓస శ్రీనివాస్, మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు రూపొందించిన నూతన సంవత్సర డైరీని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ముషరఫ్ అలీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో సాంకేతిక సహాయకుల పాత్ర కీలకమన్నారు. కష్టపడి పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, ఏపీడీ ప్రసాద్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సుధాకర్, గంగాప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

డీటీడబ్ల్యూవోను కలసిన నాలుగో తరగతి ఉద్యోగులు



ఖానాపూర్: జిల్లా ఇన్‌చార్జి డీటీడబ్ల్యూవోగా బాధ్యతలు స్వీకరించిన సౌజన్యను నాలుగో తరగతి ఉద్యోగులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల వసంత్, కోశాధికారి తిరుపతి, సభ్యులు కమల, ప్రమీల, లింగన్న పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా



వర్చువల్ మీటింగ్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్/ఖానాపూర్: రానున్న రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా సూచించారు. నిర్మల్‌లోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో, భైంసాలోని హరియాలీ కన్వెన్షన్‌లో, ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లోని సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ కమిటీల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో నడ్డా వర్చువల్‌గా మాట్లాడారు. దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. రైతుల పంట రుణాలు మాఫీ చేయకపోవడంతో నాలుగేళ్లుగా రైతులకు వడ్డీ భారంగా మారుతోందని తెలిపారు. లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న కేసీఆర్ మాట తప్పారని పేర్కొన్నారు. రైతుబంధు పేరుతో వడ్డీలేని రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ(ట్రాక్టర్, కల్టివేటర్లు వగైరా), డ్రిప్ ఇరిగేషన్, ఉచిత ఎరువులు వంటి సబ్సిడీలు ఎత్తివేశారని ప్రజలకు వివరించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఇస్తామన్న రూ.3016 భృతి ఇవ్వలేదని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్‌గా పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు బూత్‌స్థాయిలో ఎలా పనిచేయాలి, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో దిశానిర్దేశం చేశారు. సరళ్ యాప్ గురించి అవగాహన కల్పించారు. పార్టీ కార్యకర్తలతోపాటు పార్టీ సానుభూతిపరులతో 6359119119 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి పార్టీకి మద్దతు ఇచ్చేలా కృషిచేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పాలక్‌లు వెంకటరమణారెడ్డి, రచనారెడ్డి, బొమ్మ శ్రీరం చక్రవర్తి, ప్రభారి నాయుడు, ప్రకాశ్, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసిమ్మె రాజు అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, పట్టణ అధ్యక్షుడు సదం అరవింద్, జిల్లా ప్రభారి మ్యాన మహేశ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఓం ప్రకాశ్‌లడ్డా, నారాయణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, జాయింట్ కన్వీనర్ సుమన్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, హరినాయక్, జానుబాయి, టేకు ప్రకాశ్, నాయిని సంతోష్, ఉపేందర్, శ్రావణ్, గోపాల్‌రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



భైంసాలో మాట్లాడుతున్న పాలక్ రచనారెడ్డి



ఖానాపూర్‌లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్రీరాం

క్లుప్తంగా

టైగర్‌జోన్ పరిధిలో తవ్వకాలు నిషేధం

ఇచ్చోడ(బోథ్): కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో మొరం, ఇసుక తవ్వకాలను పూర్తిగా నిషేధించినట్లు టైగర్‌జోన్ అటవీశాఖ అధికారి వాహబ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టైగర్‌జోన్ బఫర్ ఏరియా ప్రాంతంలో అక్రమంగా దున్నడం, ఇసుక, మొరం తవ్వకాలు చేపట్టడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. తెలంగాణ అటవీ చట్టం 1967, వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 అటవీ సంరక్షణ చట్టం ,1980, జీవవైవిధ్య చట్టం 2002 ప్రకారం అటవీ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని నీలాయిపేట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. మామడ మండలం పులిమడుగుతాండకు చెందిన గణేశ్ (40) జిల్లా కేంద్రంలో కట్టెలు అమ్ముకుని సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగివస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

దొంగకు దేహశుద్ధి

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పట్టపగలే చోరీకి పాల్పడుతున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆలయ హుండీని పగులగొడుతుండగా సమీపంలోనే ఉన్న మహిళలు గమనించి అరవడంతో పారిపోయేందుకు యత్నించాడు. అతన్ని వెంబడించిన గ్రామస్తులు గంగాయిపేట్ సమీపంలో పట్టుకున్నారు. నిందితుడు కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రమేశ్‌గా గుర్తించినట్లు వారు పేర్కొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ముగ్గురు డిగ్రీ విద్యార్థులకు గాయాలు



గాయపడ్డ విద్యార్థిని

కడెం(ఖానాపూర్): మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ము గ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. దస్తురా బాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఏడుగురు, భూత్కూర్, దస్తురాబాద్ గ్రామాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఖానాపూర్‌లోని వాగ్దేవి కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. శనివారం పరీక్షలు రాసేందుకు ఆటోలో వెళ్తుండగా ధర్మాజీపేట్ వద్ద కుక్కలు అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రజిత, పూజిత, తులసీకి గాయాలు కావడంతో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖండేవ్ సన్నిధిలో మహాపూజ



ఖండేవ్‌కు పూజలు చేస్తున్న తొడసం వంశీయులు

- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన తొడసం వంశీయులు
- ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే



మొక్కుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్



ఇంటింటా నూనె సేకరిస్తున్న ఆదివాసీ మహిళలు



సంప్రదాయబద్ధంగా పలకరిస్తున్న మహిళలు

నార్నూర్(ఆసిఫాబాద్): పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తొడసం వంశీయులు వారి ఆచారం, సంస్కృతి, సంప్రదాయం ప్రకారం శుక్రవారం రాత్రి ఖండేవునికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భేటి అయ్యారు. ఒకరికొకరు సాదక బాధకాలు తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితి తాలూకాలోని కొద్దిగూడ గ్రామానికి చెందిన తొడసం ఆడపడుచు మెస్రం నాగుబాయి చందు దేవుని సన్నిధిలో రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగింది. సంప్రదాయం ప్రకారం మహాపూజ పూర్తి చేశారు. 15 రోజుల పాటు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. మహాపూజకు జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఐటీడీఏ పాలక మండలి చైర్మన్ కనక లక్కేరావుకు తొడసం వంశీయులు సంప్రదాయం ప్రకారం తలపాగచుట్టి స్వాగతం పలికారు. అనంతరం ఖండేవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత ఈతరం యువతపై ఉందన్నారు. ఆదివాసీ ఆలయాల అభివృద్ధికోసం ప్రత్యేక నిధుల కోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, గ్రీన్ ఇండియా డైరెక్టర్ బాదావత్ పూర్ణచందర్, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఎంపీటీసీ పరమేశ్వర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక ప్రభాకర్, కార్యదర్శి మెస్రం మానిక్‌రావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఆగమ' పరీక్షలు



అర్చకులకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్: దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించిన ఆగమ(అర్చక) పరీక్షలు శనివారం ముగిశాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వర, ప్రవర, ప్రవేశ పరీక్షలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 237 మంది అర్చకులు హాజరయ్యారు. 40 సంవత్సరాల లోపు వారికి రాత, మౌఖిక పరీక్షలు, ఆపై వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారి వివరాలు ఉన్నతస్థాయి అధికారులకు నివేదించనున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎస్.నవీన్ కుమార్ వెల్లడించారు.

ఒడ్డెవాడలో ఒకరి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడలో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అల్లెపు నర్సయ్య ఇంట్లో భార్యతో గొడవపడ్డాడు. దీంతో అతని భార్య ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నర్సయ్యతో పాటు అతని కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నర్సయ్య శనివారం ఇంటివద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యంకోసం నిర్మల్‌కు రెఫర్ చేశారు. కాగా పోలీసుల వేధింపుల వల్లే నర్సయ్య ఆత్మహత్యకు యత్నించాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా ఆత్మహత్యాయత్నంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

10న సైన్స్ ఎగ్జిబిషన్

ఉట్నూర్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ఉన్న పీఎమ్మార్సీ భవనంలో ఈ నెల 10న ఐటీడీఏ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ విజయవంతం అయ్యేలా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చీటింగ్ కేసులో ఒకరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అజయ్‌బాబు

ఖానాపూర్: ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని కడెం, దస్తురాబాద్ మండలాల్లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ సంస్థను మోసం చేసిన వినయ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌బాబు తెలిపారు. శనివారం పట్టణంలో ని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ సంస్థలో ఏజెంట్‌గా పనిచేస్తున్న వినయ్ వసూలు చేయగా వచ్చిన రూ.1,60,594ను తన సొంతా నికి వాడుకున్నాడని మేనేజర్ ఫిర్యాదు చేసిన ట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.70వేలు రికవరీ చేయడంతో పాటు మిగతా డబ్బుల ను చెల్లించాలని చెప్పినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై శంకర్, ఏఎస్సై రాంచందర్, సిబ్బంది రవికుమార్, రవినాయక్ పాల్గొన్నారు.

కూలీలపై తేనెటీగల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

భైంసాటౌన్(ముథోల్): మండలంలోని లింగి గ్రామంలో పత్తి ఏరేందుకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. మహారాష్ట్రకు చెందిన పలువురు కూలీలతో పాటు భైంసా పట్టణానికి చెందిన కూలీలు శనివారం పత్తి ఏరేందుకు వెళ్లారు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో వలసకూలీలు సాగర, రమ, శాలిని, కుసుంబాయితో పాటు భైంసాలోని ఓవైసీనగర్‌కు చెందిన అజ్మీరా, ఆస్మా, సల్మా, అమీనా, నిషత్, వారి వెంట వెళ్లిన ఇద్దరు చిన్నారులు సోమేశ్, తల్హాలు గాయపడ్డారు. వారికి భైంసా ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు.

బైక్ పైనుంచి పడి వృద్ధురాలు మృతి

బెజ్జూర్(సిర్పూర్): బైక్ పైనుంచి కిందపడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన తొర్రెం మొండక్క(70) శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన కిరణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎక్కి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

లోకేశ్వరం(ముథోల్): మండలంలోని బామ్నికేలో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. బామ్నికే శివారు ప్రాంతంలో ఉన్న మూడెకరాల భూమిపై గ్రామానికి చెందిన సుమలతకు, గడ్‌చాంద గ్రామానికి చెందిన కవితకు మధ్య కొంతకాలంగా భూవివాదం ఉంది. కవిత కోర్టు ద్వారా అట్టి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని పట్టా పాస్‌బుక్ పొందింది. నాకు ప్రాణహాని ఉందని కోర్టును ఆశ్రయించగా పోలీసు రక్షణ తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. శనివారం బామ్నికే శివారు ప్రాంతంలోని భూమి వద్ద పోలీసులు కవితకు రక్షణ కల్పించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మనస్తాపానికి గురైన సుమలత పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే పోలీసులు భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుమలతపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో ఒకరిపై దాడి



గాయపడిన రాజలింగం

సారంగపూర్(నిర్మల్): మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన ఉట్ల రాజలింగం (40)పై అదే గ్రామానికి చెందిన వాహిద్ సుత్తితో దాడిచేసి గాయపర్చాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తన పనులు ముగించుకుని రాజలింగం ఇంటికి తిరిగి వస్తుండగా ఇదే గ్రామానికి చెందిన వాహీద్ వ్యక్తిగత కారణాలతో అతనిపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై సారంగాపూర్ పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు అందితే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దహెగాం(సిర్పూర్): మండలంలోని హత్తిని శివారులో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు జరిపిన దాడుల్లో రూ.24,800 నగదు, ఐదు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న జర్పుల కుమార్, ధరావత్ తిరుపతి, సుంకరి శ్రావన్‌కుమార్, పెద్దల సురేష్, చప్పిడె రవి, కార్నాతం అంజన్న, సోమిశెట్టి విఘ్నేష్, పుప్పాల నవీన్, రెడ్డి శ్రీను, మొర్లె పున్నంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. గ్రామాల్లో ఏవరైనా పేకాట, కోడి పందాలు ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్(ఖానాపూర్): ఇంటర్ పూర్తి చేసిన గిరిజన బాలికలు గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశానికి మార్చి 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఫిబ్రవరి 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో బీకాం కంప్యూటర్, బీఎస్సీ కంప్యూటర్, బీఎస్సీ (బీజెడ్‌సీ), బీఎస్సీ (ఎంపీసీఎస్) ఆంగ్లమాధ్యమంలో బోధన జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టైగర్‌జోన్‌ను సందర్శించిన డబ్ల్యూసీఎస్ డైరెక్టర్



రైతుతో మాట్లాడుతున్న డైరెక్టర్ విద్యాఆత్రేయ

కడెం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని కడెం, ఉడుంపూర్ అటవీ రేంజ్‌లను ×వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ సొసైటీ (ఇండియా)కంట్రీ(డబ్ల్యూసీఎస్) డైరెక్టర్ విద్యా ఆత్రేయ, ఈస్టన్ ఘట్స్ ప్రోగ్రాం హెడ్ ఇమ్రాన్ సిద్ధిఖీతో కలిసి శనివారం సందర్శించారు. డబ్ల్యూసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ పండ్ల మొక్కల ప్లాంటేషన్ సందర్శించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూటీ మెంబర్ బెంజిమన్ క్లైమెంట్, హైటీకాస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎనగందుల వెంకట్, సీపీఎఫ్ కోఆర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం



పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో కదం సురేశ్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న మెస్రం వంశీయుల మహా పూజలతో ప్రారంభం కానున్న నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భక్తులు, మెస్రం వంశీయులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంక్‌ల వద్ద, నీటి నల్లల వద్ద పారిశుధ్యం లోపించకుండా ముందస్తుగా ఆర్‌సీసీ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉట్నూర్ ఆర్డీవో కదం సురేశ్ శనివారం నాగోబా ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంజం సోము, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, ఆయా శాఖల అధికారులు, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన



మాట్లాడుతున్న కిరణ్ కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కోర్టులోని ఏపీపీ కార్యాలయంలో శనివారం ఏపీ పీలు దేవేందర్, నవీన్ చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కిరణ్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. దరఖాస్తు తీసుకునే సమయంలో చేపట్టే విధానాలు, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం, హాస్పిటల్‌కు పంపడం, డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్ సమర్పించడం, సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడం, నేరస్తులకు శిక్ష పడే విధంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీపీలు సంజయ్‌కుమార్ వైరాగ్రే, రమణారెడ్డి, సీఐలు పురుషోత్తంచారి, సత్యనారాయణ, మల్లేశ్, నరేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉట్నూర్ వైద్యుల పనితీరు భేష్

- ఆస్పత్రిలో తొలి సిజేరియన్ కాన్పు
- వైద్యులను అభినందించిన పీవో



బాలింతతో మాట్లాడుతున్న పీవో

ఉట్నూర్(ఖానాపూర్): ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో తొలి సిజేరియన్ కాన్పు విజయవంతం చేయడంలో వైద్యుల కృషి ఎంతో ఉందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులను అభినందించారు. శస్త్ర చికిత్సల వార్డును సందర్శించారు. కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రానికి చెందిన బాలింత సోంబాయి, బిడ్డ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇతర వసతుల కల్పనకు ఐటీడీఏ ద్వారా కృషి చేస్తామన్నారు. ఆస్పత్రికి వైద్యంకోసం వచ్చిన వారిని అత్యవసరమైతేనే ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఉపేందర్, వైద్యాధికారులు మహేందర్, మమత, నరేందర్, శ్వేత, సతీశ్, సిబ్బందిపాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు ప్రోత్సాహం?

బోథ్: డిగ్రీ పరీక్షల్లో కళాశాలలు మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని నిజం చేస్తూ ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో 30 మంది విద్యార్థులు డిబార్ కావడం అనుమానాలకు తావిస్తోంది. కేయూ పరిధిలో ఇప్పటివరకు 34 మంది డిబార్ కాగా అందులో 30 మంది విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన వారే కావడం గమనార్హం. వారిలో నేరడిగొండ మండలంలోని రెండు కేంద్రాల్లో 11 మంది, బజార్ హత్నూర్ మండలంలోని ఓ కళాశాల విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్ష రాస్తున్నారు. ఈ కళాశాల కేంద్రాన్ని కేవలం 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇచ్చోడలో వేయకుండా 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేరడిగొండలో వేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. యూనివర్శిటీ అధికారులను మచ్చిక చేసుకుని అనుకూల కేంద్రాలను వేయించుకున్నట్లు తెలుస్తోంది.

15 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ 15 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఉట్నూర్‌లోని పులాజీబాబా డిగ్రీ కళాశాలలో ఒకరు, అజ్మీర రేఖా శ్యామ్ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాలలో ఒకరు, భైంసాలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా యువతి మృతి



దస్రుబాయి(ఫైల్)

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని కమ్మర్‌గాం గ్రామానికి చెందిన దుర్గం దస్రుబాయి(22) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సదరు యువతి శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని పంట చేనుకు కాపలా వెళ్లింది. మధ్యాహ్నం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా పంటచేనులో మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో ఎస్సై విజయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. యువతి తల్లి శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

మృతిపై అనుమానాలు

దస్రుబాయి మృతి పట్ల తల్లి శకుంతల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంట చేనుకు కాపలా వెళ్లిన తన కూతురును హత్య చేసి నోట్లో పురుగుల మందు పోసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. భూతగాదాల నేపథ్యంలో హత్య చేశారని నిందితులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లోఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి 44వ జూనియర్‌బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను శనివారం జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జీఎం ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.